క్లుప్తంగా

మంత్రికి వినతి



మరిపెడ రూరల్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కారోబార్లను అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని వారు కోరారు. ఈమేరకు మరిపెడ మండలానికి ఓ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎస్‌కే జానీమియా, యాదగిరి, మహేష్, యాకయ్య, వేణుగోపాలచారి, నరేష్, హుస్సేన్, వెంకన్న, బాబు పాల్గొన్నారు.

కార్మికుల ధర్నా

గూడూరు: మండలంలోని తీగలవేణి మిడ్‌వెస్ట్ గ్రానైట్ క్వారీ ఎదుట సోమవారం అందులో పనిచేసే కిందిస్థాయి కార్మికులు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా కార్మికులు శ్రీనివాస్, యార మల్లేషం, కావర్ లక్ష్మణ్, ధారావత్ చక్కి, జినుక ఉప్పలయ్య మాట్లాడుతూ.. యాజమాన్యానికి తమ సమస్యలు చేరవేయడంలో తమకంటే పైస్థాయి ఉద్యోగులు తమ సమస్యలను కప్పిపుచ్చుతూ వారు లాభం పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను యాజమాన్యం పరిష్కరించేంత వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు.

సమస్యలు పరిష్కరించండి

నెహ్రూసెంటర్: ఆల్‌పెన్షనర్స్, రిటైర్డ్ పెన్షనర్స్ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గంగరబోయిన మల్లయ్య, కార్యదర్శి కాగితం వీరయ్య అన్నారు. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. పాతపెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. జిల్లా కేంద్రంలోని గంగపుత్ర భవన్‌లో ఈనెల 18వ తేదీన జరిగే అసోసియేషన్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కబడ్డీ పోటీలు



మహబూబాబాద్ రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని అమనగల్ గ్రామంలో ఆదివారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఆలేరు గ్రామ శివారు ఇస్లావత్ తండా గ్రామానికి చెందిన యువకులు మొదటి బహుమతి గెలుచుకోగా, అమనగల్ గ్రామానికి వైస్‌ఎంపీపీ, అమనగల్ గ్రామ ఎంపీటీసీ ఎల్ది మల్లయ్య గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మొదటి బహుమతి రూ.3,016, రెండో బహుమతి రూ.2,016, మూడో బహుమతి రూ.1016 అందజేశారు. ఈకార్యక్రమంలో నిర్వాహకులు గణేష్, మహేష్, వినయ్, ఉమేష్, రాకేష్, పండు, వంశీ, నూకల జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'కు ముమ్మర ఏర్పాట్లు

తొర్రూరు: రెండో విడత 'కంటి వెలుగు' కార్యక్రమంతో నేత్ర సమస్యలు దూరమవుతాయని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం కంటివెలుగు కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైద్యాధికారి మీరాజ్, డాక్టర్ జ్వలిత, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు, ఏఈ రంజిత్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: ఈనెల 18నుంచి మొదలయ్యే రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని కలిసికట్టుగా విజయవంతం చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, మరిపెడ మండలం ప్రత్యేక అధికారి డాక్టర్ సుధాకర్ అన్నారు. మరిపెడ మండలం గిరిపురం, బోట్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మరిపెడ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం కంటి వెలుగుపై మాక్ డ్రిల్ చేసి వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేలోతు ధన్‌సింగ్, మరిపెడ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ గుగులోతు రవి, ఎంపీఓ పూర్ణచందర్‌రెడ్డి, సర్పంచులు పెద్దబోయిన జనార్దన్, అనురాధ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవంగర: కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి ఖుర్షీద్ అన్నారు. సోమవారం మండలంలోని అవుతాపురం గ్రామంలోని హెల్త్ సబ్‌సెంటర్‌లో కంటి రెండో విడత వెలుగులో భాగంగా మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని వైద్యాధికారులు చేపట్టగా పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓ సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: బోట్యతండాలో వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ప్రత్యేక అధికారి సుధాకర్

డోర్నకల్: ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న కంటివెలుగు కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు డోర్నకల్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక అశోక్‌భవన్‌లో కంటి వెలుగు కార్యక్రమం కోసం ఏర్పాటు చేస్తున్న శిబిరంను ఆయన పరిశీలించారు. అశోక్‌భవన్, బిషప్ అజరయ్య ఫంక్షన్ హాలు, డీడీ హైస్కూల్, ఎస్సీబీసీ కాలని ప్రభుత్వ పాఠశాలల్లో కంటివెలుగు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న ఉన్నారు.



తొర్రూరు: సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రామచంద్రయ్య



డోర్నకల్: అశోక్‌భవన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్, చైర్మన్

ఖమ్మం సభను విజయవంతం చేయండి

గార్ల: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన, సీపీఎం పార్టీకి చెందిన 42 కుటుంబాలు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. సోమవారం స్థానిక వర్తకసంఘం భవనంలో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈనెల 18 వ తేదీన ఖమ్మంలో నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ బహిరంగ సభకు మండలం లోని టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు వేలాదిగా తరలిరావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, సర్పంచ్‌లు అజ్మీర బన్సీలాల్, భూక్యా మోతీలాల్, కోఆప్షన్ ఎండి ఖదీర్, రైతుబంధు మండల కోఆర్డినేటర్ పానుగంటి రాధాకృష్ణ పాల్గొన్నారు.



గార్ల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

సభకు భారీగా తరలిరావాలి

కొత్తగూడ: ఖమ్మంలో జరిగే బీఆర్‌ఎస్ బహిరంగ సభకు ప్రజలను భారీగా తరలించే విధంగా కార్యకర్తలు పని చేయాలని ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవింద్‌నాయక్ సూచించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొత్తగూడ, గంగారం మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధ్యతలు గ్రామాల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, వేణు, సమ్మయ్య, సారంగపాణి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం: ఈ నెల 18న ఖమ్మంలో జరుగు బీఆర్‌ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు అన్నారు. మండలంలోని బాలాజీపేట, వెంకటాపురం గ్రామ పంచాయతీల్లో సోమవారం సన్నాహక సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రామ్మూర్తిగౌడ్, బాలాజీపేట సర్పంచ్ జగన్, పీఏసీఎస్ చైర్మన్ మూలమధూకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ వీరభద్రంతోపాటు నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణలోనే కళాకారులకు గుర్తింపు

తొర్రూరు: తెలంగాణలోనే కళాకారులకు సముచిత గౌరవం, గుర్తింపు లభిస్తున్నాయని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని జనని ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సాంస్కృతిక సంబరాలు ఆదివారం రాత్రి డివిజన్ కేంద్రంలో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రిపాల్గొన్నారు. డ్యాన్స్, పాటలు, ఏకపాత్రాభినయాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన పలువురికి, వివిధ రంగాల్లోని ప్రముఖులకు మంత్రి చేతుల మీదుగా బహుమతులు అందించారు. మంత్రి మాట్లాడుతూ కళలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తుందని తెలిపారు. కళలు ఒక ప్రాంత చరిత్రకు తార్కాణాలని, కళలను, సంస్కృతిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్, సెంట్రల్ ఫిల్మ్ బోర్డు సభ్యుడు ఆకుల నాగేశ్వర్, సినీ హీరో సాయికృష్ణ, హీరోయిన్ స్వప్నాచౌదరి, జనని ఆర్ట్ ఫౌండేషన్ ప్రతినిధులు కస్తూరి పులేందర్, భాస్కర్ పాల్గొన్నారు.



సత్కరిస్తున్న మంత్రి దయాకర్‌రావు

ఐక్యతగా హక్కులు సాధించుకోవాలి

మరిపెడ రూరల్: రాజకీయాలకు అతీతంగా లంబాడీలు ఐక్యంగా ఉద్యమించి హక్కులు సాధించుకోవాలని లంబాడీల ఐక్య వేదిక (లైవ్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ అన్నారు. మండలంలోని వెంకట్యతండాలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవాలాల్ మహారాజ్, శీతల, తీజ్ లాంటి గోర్ ధర్మానికి చెందిన పండగలను రాష్ట్ర జాబితాలో చేర్పించి వాటిని సెలవు దినాలుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. అనంతరం నాయక్ స్టార్ సమితి సభ్యులకు టీషర్ట్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బానోతు వెంకన్ననాయక్, తేజావత్ అభినాయక్, భిక్షపతి పాల్గొన్నారు.

సన్నబియ్యం పేరుతో బురిడీ

కేసముద్రం: సన్నబియ్యం అమ్ముతామంటూ ఓ గుర్తుతెలియని వ్యక్తులు దొడ్డుబియ్యం అమ్మి బురిడీ కొట్టించిన సంఘటనం ఇనుగుర్తి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తాము సంక్రాంతి పండుగకు ఇంటికి వెళ్తున్నామని, తమదగ్గరున్న 2క్వింటాళ్ల జైశ్రీరామ్ సన్న బియ్యం క్వింటాకు రూ.3వేల చొప్పున అమ్ముతున్నామని, కొంత మేరా సన్న బియ్యం చూపి ప్రచారం చేయడంతో, నమ్మిన మణెమ్మ అనే మహిళ ఆ బియ్యాన్ని కొనుగోలు చేసింది. తీరా పండుగపూట బస్తాను ఓపెన్ చేసి చూడగా దొడ్డు బియ్యం కనిపించడంతో అవాక్కయింది. సన్న బియ్యం పేరిట మోసం చేశారంటూ బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: యువతరం క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని బీఆర్‌ఎస్ వార్డు కౌన్సిలర్లు బండి ఇందిర వెంకన్న, వట్టం జ్యోత్స్న శివకుమార్ అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లి రెండు, మూడు వార్డుల్లో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని నామిరెడ్డి వెంకట్‌రెడ్డి పార్వతమ్మ జ్ఞాపకార్థం నామిరెడ్డి సీతారాంరెడ్డి హేమేంద్రాదేవి సహకారంతో జేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించగా సోమవారం ఫైనల్ మ్యాచ్‌లో జమాండ్లపల్లి స్టార్-11, యంగ్‌స్టార్ జట్లు తలపడగా జమాండ్లపల్లి స్టార్-11, విజేతగా నిలిచింది. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు బాబురావు, దిలీప్‌రెడ్డి, మాధవరెడ్డి, వెంకన్న, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



కప్ అందుకుంటున్న జమాండ్లపల్లి స్టార్-11 జట్టు

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న యాదవులు

గూడూరు: మండలంలోని మచ్చర్ల శివారు దేవుడి గుట్టపై సోమవారం మల్లికార్జునస్వామి కల్యాణోత్సవ వేడుకలను యాదవ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆదివారం రోజు ఉదయం యాదవ సంఘం పెద్దలు గుట్టపైకి చేరుకొని స్వామి సన్నిదానంలో అంకురార్పణ చేసి గణపతి పూజతో ఒగ్గుకథలతో పూజలు ప్రారంభించారు. సోమవారం ఉదయం పెద్ద పట్నం వేసి మల్లికార్జునస్వామి కల్యాణోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు నర్సయ్య, మల్లేషయాదవ్, తదితరులు ఏర్పాట్లు చేశారు.

ఊరూరా సంక్రాంతి వేడుకలు



మరిపెడ రూరల్: తండధర్మారంలో గంగిరెద్దును పూజిస్తున్న ఎంపీపీ అరుణ



కురవి: వీరభద్రస్వామిని దర్శించుకునేందుకు భారీగా వచ్చిన భక్తులు



మహబూబాబాద్: ముగ్గుల పోటీల విజేతకు బహుమతి అందజేస్తున్న ఎస్సై విజయ్‌కుమార్, తదితరులు



గూడూరులో ఓ ఇంటి ఎదుట ముగ్గు వేస్తున్న చిన్నారి

తెలుగువారి సంస్కృతిని ప్రతిబింబించేలా సంక్రాంతి సంబురాలు కనుల పండువగా ఆదివారం జరిగాయి. గంగిరెద్దులు, గాలిపటాలు, కోలాటాల నడుమ సాంస్కృతిక ప్రదర్శనలతో సంబరాలు అంబరాన్ని అంటాయి. ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సంప్రదాయ పిండివంటల పోటీలు ఆకట్టుకున్నాయి.

\- సాక్షి నెట్‌వర్క్



కేసముద్రం: అమీనాపురంలో గంగిరెద్దుల విన్యాసం

సంక్షిప్త సమాచారం

నిబంధనలు పాటించాలి

డోర్నకల్: ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలని డోర్నకల్ ఎస్సై రవికుమార్ కోరారు. సోమవారం స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల నుంచి రైళ్లలో డోర్నకల్‌కు చేరుకుని ఆటోలను ఆశ్రయించే ప్రయాణికులను ఆటో డ్రైవర్లు సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కొత్తగూడ: కురుమ సంఘం క్యాలెండర్‌ను సంఘం నాయకులు మండలకేంద్రంలో సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు ముదురు మల్లయ్య మాట్లాడుతూ.. కురుమల సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. పరశురాం, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మాయావతి జన్మదిన వేడుకలు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలోని బీఎస్పీ పార్టీ జాతీయ అధ్యక్షురాలు, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం మాయావతి జన్మదిన వేడుకలను బీఎస్పీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో బీఎస్పీ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ దార్ల శివరాజ్, అధ్యక్షులు తేజావత్ అభినాయక్, ఇన్‌చార్జ్ విజయ్‌కాంత్, ఉపాధ్యక్షుడు తగరం నాగన్న, ప్రధాన కార్యదర్శి ఇస్సంపెల్లి ఉపేందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఐతం ఉపేందర్, జిల్లా కార్యదర్శులు దార ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

నగదు బదిలీ చేయాలి

మహబూబాబాద్: గొల్లకురుమలకు నగదు బదిలీ చేస్తామని హామీ ఇచ్చి మభ్యపెడుతూ మోసం చేస్తే ఊరుకునేది లేదని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి బి.అశోక్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని పశువైద్యశాల ఆవరణలో సోమవారం జీఎంపీఎస్ 2023 క్యాలెండర్లను నాయకులు ఆవిష్కరించారు ఈ . కార్యక్రమంలో వెంకటయ్య, కౌన్సిలర్లు అనురాధ, కోడి నాగలక్ష్మి, లింగయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

మరిపెడ రూరల్: గిరిజనులు ఆరాధ్యదైవం అయిన మరిపెడ మండలం వెంకట్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని బంగారు మైసమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ సూరనాయక్, అఫ్జల్ , తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

డోర్నకల్: డోర్నకల్ గ్రేస్ పాస్టర్స్ ఫెలోషిప్ మండల కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానికంగా జరిగిన సమావేశంలో గ్రేస్ పాస్టర్స్ ఫెలోషిప్ మండల అధ్యక్షుడిగా ఎం.రమేష్‌పాల్, ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా కె.తిమోతీ, కోశాధికారిగా బి.జాన్సన్, సలహాదారులుగా బి.ప్రభురాజ్, జె.జాన్‌వెస్లీ, యు.జాన్‌పాల్, పి.వికాస్‌డేనియల్, శేఖర్‌డేనియల్, ఏ.జయరాజ్, ఆర్ మార్క్ ఎన్నికయ్యారు.

శ్రీగోదారంగనాథుల కల్యాణం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామివారి దేవాలయంలో శ్రీగోదారంగనాథుల కల్యాణోత్సవం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు ఆలయ ప్రాంగణంలో శోభాయమానంగా ఏర్పాటుచేసిన వేదిక, ఆదిశేషుడి వాహనంపై శ్రీగోదారంగనాథులను కొలువుదీర్చి శ్రీ రుక్మిణి సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామివారి, శ్రీగోదాదేవి అమ్మవారి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా జరిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కురవి: మండలంలోని మోద్గులగూడెం జెడ్పీ హైస్కూల్‌లో 2005-06 బ్యాచ్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం సోమవారం జరిగింది. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

టేకు చెట్లు నరికిన గుర్తు తెలియని వ్యక్తులు

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన చాగంటి శ్రీనివాస్ అనే రైతు తన పంటపొలం గట్టుపై పెంచుకున్న టేకు చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి నరికినట్లు బాధిత రైతు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. కాగా హరితహారంలో భాగంగా మూడేళ్ల క్రితం నాటిన సుమారు 30టేకు చెట్లను నరికివేశారంటూ రైతు పేర్కొన్నాడు.

భూతగాదాలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ

మహబూబాబాద్ రూరల్: వ్యవసాయ భూమి విషయంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ముల మధ్య వాగ్వివాదం జరిగి ఘర్షణకు దారితీసి ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా ముగ్గురికి గాయాలయ్యాయి. మండలంలోని బలరాంతండా గ్రామ పరిధిలో ఆదివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై సీహెచ్ అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలంలోని బలరాంతండా గ్రామానికి చెందిన ఇస్లావత్ సిరి, బిగిరి దంపతులకు ముగ్గురు కుమారులు కిష్టు, శంకర్, వెంకన్న ఉన్నారు. వ్యవసాయ భూముల పంపకం విషయంలో తరచూ మూడు కుటుంబాల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఈవిషయమై పలుమార్లు మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఇరువర్గాలు ఫిర్యాదులు కూడా చేసుకున్నారు. ఇదే క్రమంలో ఆదివారం గొడవ జరిగిన సందర్భంలో కిష్టు, శంకర్, వెంకన్న కుటుంబ సభ్యులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈప్రమాదంలో ముగ్గురికి గాయాలు కాగా వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని రూరల్ ఎస్సై పేర్కొన్నారు.

ఎంపీపీ దంపతులకు మంత్రి పరామర్శ

కురవి: ఇటీవల మానుకోట జిల్లా కేంద్రంలో జరిగిన సీఎం సభకు వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎంపీపీ గుగులోత్ పద్మావతిరవినాయక్ దంపతులను సోమవారం రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత పరామర్శించారు.

క్రైం కార్నర్..

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నెల్లికుదురు: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం సొల్లతండా శివారు శనిగకుంట తండాలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై పత్తిపాక జితేందర్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం శనిగకుంట తండాకు చెందిన గుగులోతు వీరన్న (38) దంపతులకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. వీరు బ్రతుకు దెరువుకోసం వరంగల్‌లో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. సంక్రాంతి పడుగకు 15 రోజుల ముందే తండాకు వచ్చారు. ఈ నెల 15న ఆదివారం సాయంత్రం వీరన్న ఇంట్లో చీరతో ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడి వీరన్న ఒంటిపై అక్కడక్కడ గాయాలు ఉన్నాయన్నారు. మృతుని సోదరుడు గుగులోతు రాజు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలానికి తొర్రూర్ డీఎస్పీ రఘు సందర్శించి సంఘటన వివరాలను ఆరాతీసిన్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

మహబూబాబాద్ రూరల్: చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని కేటీఆర్ కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. టౌన్ ఎస్సై విజయరాంకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామానికి చెందిన మక్కాల గురుమూర్తి(35)డిసెంబర్ నెల 17వ తేదీ ఉదయం ద్విచక్ర వాహనంపై కేటీఆర్ కాలనీ నుంచి జిల్లా కేంద్రంలోకి వస్తున్న క్రమంలో వైఎస్సార్ సెంటర్ ప్రాంతంలో వాహనం డివైడర్‌ను ఢీకొంది. మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు.

చికిత్స పొందుతున్న మహిళ..

గార్ల: కల్లుతిరిగి కిందపడి పోవడంతో తల వెనుక భాగంలో తీవ్రగాయమై ఓ మహిళ మృతిచెందిన సంఘటన అంకన్నగూడెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై బానోత్ వెంకన్న కథనం ప్రకారం వివరాలు.. గార్ల మండలం సీతంపేట పంచాయతీ అంకన్నగూడెం గ్రామానికి చెందిన చీమల పుల్లమ్మ(50) ఆదివారం ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి పండుగ చేసుకొని రాత్రి స్నానం చేసుకొని చీర కట్టుకునే సమయంలో కల్లుతిరిగి పడిపోయింది. పుల్లమ్మ తల వెనుక భాగం చిన్నమెదడుకు దెబ్బతగలడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే ఆమెను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స జరిపిస్తుండగా సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది. భర్త బుచ్చిరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలు..

మహబూబాబాద్ రూరల్: చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని ఇస్లావత్‌తండా (ఎం) గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. కురవి ఎస్సై బి.రాము తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇస్లావత్‌తండా(ఎం) గ్రామానికి చెందిన ఇస్లావత్ రక్కి (70) కొంత కాలం క్రితం ఎకరం భూమిని రూ.22లక్షలకు అదే తండాకు చెందిన ఇస్లావత్ గణేష్‌కు అమ్మింది. రూ.13 లక్షలు కట్టారు. మిగిలిన డబ్బులు కోసం అడుగుతున్న సందర్భంలో ఈనెల 12వ తేదీన గొడవ జరిగింది. ఈక్రమంలో ఇస్లావత్ గణేష్, అతడి భార్య ప్రమీల, తండాకు చెందిన మంగ్యా, భావ్‌సింగ్ తదితరులు ఇస్లావత్ రక్కి ఇంటిపై దాడి చేశారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఈనెల 13వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు..

డోర్నకల్: పాపటపల్లి-డోర్నకల్ జంక్షన్ రైల్వే స్టేషన్‌ల మధ్యన గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు(60) మృతి చెందినట్లు సోమవారం ప్రభుత్వ రైల్వే పోలీస్ డోర్నకల్ సబ్ ఇన్‌స్పెక్టర్ సోమవారం కె.శ్రీకాంత్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు, మృతుడి ఆచూకీ తెలియనందున మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వం ఆస్పత్రి మార్చ్యూరీలో భద్రపరచడం జరిగిందని వివరించారు. ఎవరికైనా వ్యక్తి వివరాలు తెలిస్తే 94406 27537, 94903 32143 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్: కడుపునొప్పి భరించలేక ఓ వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. టౌన్ ఎస్సై విజయరాంకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రం శివారులోనిన్న నారాయణ నగర్ కాలనీలో నివాసం ఉండే బండారు ఉప్పలయ్య అనే వృద్ధుడు కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో తరచూ కడుపు నొప్పి రావడంతో భరించలేక మనస్థాపానికి గురైన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

కుక్కల దాడిలో ఆరు గొర్రెలు మృత్యువాత

మహబూబాబాద్ రూరల్: కుక్కలు దాడి చేయగా ఆరు గొర్రెలు మృత్యువాత పడిన సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీపురం గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు దేవనబోయిన ఐలయ్య తెలిపిన వివరాల ప్రకారం .. గొర్రెల మందను ఇంటి ఆవరణలో గల దొడ్డిలో కట్టేసి ఉంచారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక కుక్కలు గొర్రెల గుంపుపై దాడి చేయగా ఆరు గొర్రెలు మృతి చెందాయన్నారు. రూ.60వేల నష్టం వాటిల్లింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

డోర్నకల్: మండలంలోని గొల్లచర్ల క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. హున్యాతండాకు చెందిన ప్రభాకర్ ద్విచక్రవాహనంపై వేగంగా వచ్చి గొల్లచర్ల క్రాస్ రోడ్డు వద్ద ఆటోను ఢీకొట్టి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

గీత కార్మికుడికి..

నెల్లికుదురు: మండలంలోని ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామంలో గీతకార్మికుడు తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. దీంతో యాకయ్యకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు యాకయ్యను ప్రవేట్ వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థుల్లో మనోధైర్యం పెంపొందించాలి



మాట్లాడుతున్న తేజావత్ జోగ్రాం

గార్ల: విద్యార్థుల్లో మనోధైర్యం పెంపు, చెడు వ్యసనాలను వీడేందుకు ఉపాధ్యాయులు మానసిక సామాజిక అంశాలపై శిక్షణ ఇవ్వాలని బంజారా సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు తేజావత్ జోగ్రాం సూచించారు. సోమవారం బీఎస్‌ఎస్ పాఠశాల ఉపాధ్యాయులకు మానసిక సామాజిక అంశంపై పర్సన్ టు పర్సన్ అనే సంస్థ హైదరాబాద్ నిర్వాహకులు సైరస్‌కుమార్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గార్ల డిప్యూటీ తహసీల్దార్ వీరన్న, శిక్షకులు కళ్యాణి, శాంసన్‌గాంధీ, సేనా, తదితరులు పాల్గొన్నారు.